# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

VC NEWS

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ బుధవారం 17 డిసెంబర్ 2025

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:03 సంచిక: 118

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


## పోలీసులకు చిక్కిన 17మంది మావోలు

పట్టుబడ్డ వారిలో కీలక నేత చొక్కారావు?



2లో


# నేడు మూడో విడత పంచాయితీ సమరం

పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి

ఉదయం 7 నుంచి 1 గంటవరకు పోలింగ్

మధ్యాహ్నం కౌటింగ్..వెంటనే ఫలితాల ప్రకటన

నేటితో పూర్తి కానున్న పంచాయితీ ఎన్నికల వ్యవహారం



హైదరాబాద్: తెలంగాణలో మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. బుధవారం 182 మండలాల్లోని 3,752 గ్రామ పంచాయతీల్లో పోలింగ్ నిర్వహించనున్నారు. మూడో విడతలో మొత్తం 4,159 సర్పంచి స్థానాలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఇందులో 394 స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. 3,752 సర్పంచి స్థానాలకు 12,652 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. మొత్తం 36,425 వార్డులకుగాను 7,908 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. 28,410 వార్డులకు 75,725 మంది అభ్యర్థులు బరిలోకి దిగారు. 11 సర్పంచి స్థానాలకు నామినేషన్లు దాఖలు కాలేదు. రెండు గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు నిలిపివేశారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కానుంది. మధ్యాహ్నం 1 గంటవరకు పోలింగ్ నిర్వహించి

అనంతరం 2 నుంచి కౌంటింగ్ ప్రారంభిస్తారు. ఈ మేరకు ఎన్నికల అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. పోలింగ్ జరిగే గ్రామాల్లో నిషేధాజ్ఞలు అమల్లో ఉంటాయి. ర్యాలీలకు అనుమతి లేదు. ఈ ఎన్నికతో ఇక పంచాయితీ ఎన్నికల తంతు పూర్తవుతుంది. మొత్తం గ్రామాల్లో కొత్త సర్పంచ్‌ల పాలన సాగనుంది.

## గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా పంచాయితీ ఎన్నికలు

42 శాతం రిజర్వేషన్ లక్ష్యంతో కేంద్రంపై పోరాటం

పంచాయితీరాజ్ శాఖ మంత్రి సీతక్క వెల్లడి



2లో



2లో

## ఇంటర్ పరీక్షల్లో స్వల్ప మార్పు

మార్చి 3 నాటి పరీక్ష 4కు వాయిదా

## మోడీతో భేటీ అంశాలు బయటకు ఎలా వచ్చాయి?



న్యూఢిల్లీ: తెలంగాణలో బిజెపి నేతలు క్షేత్రస్థాయిలో సరిగా పనిచేయడం లేదని, పార్టీ బలోపతేంపై దృష్టి సారించడం లేదని ఇటీవల ప్రధాని మోడీ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రధాని నరేంద్రమోదీతో ఇటీవల తెలంగాణ బీజేపీ నేతలు సమావేశం అయిన విషయం తెలిసిందే. ఈ సమావేశం లో నేతలకు పలు కీలక అంశాలపై ప్రధాని మోదీ దిశానిర్దేశం చేశారు. అయితే ఈ భేటీలో ప్రస్తావించిన విషయాలు బయటకు వచ్చాయి. ఈ విషయంపై ఢిల్లీలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పందించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీతో తెలంగాణ బీజేపీ ఎంపీల సమావేశంపై వచ్చిన లీకులపై కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీతో చర్చించిన విషయాలు బయటకు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. ఎవరో కావాలనే ఈ విషయాలను లీకు చేశారన్ని ÷ర్ అయ్యారు. ఈ సమావేశంలో ప్రస్తావించిన అంశాలను బయటకు చెప్పొద్దని మోదీ చెప్పారని గుర్తుచేశారు కిషన్‌రెడ్డి. కానీ మీటింగ్‌లో జరిగిన విషయాలను బయటకు ఎవరు ఎందుకు చెప్పారని మండిపడ్డారు.

## నరేగా రద్దు..పార్లమెంటు ముందుకు

# కొత్త చట్టం

వికసిత్ భారత్ రోజ్‌గార్, ఆజీవికా హామీ మిషన్

బిల్లును ప్రవేశ పెట్టిన కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్

బిల్లుపై భగ్గుమన్న విపక్ష సభ్యులు.పోడియం వద్ద నిరసన

ప్రభుత్వ తీరును ఏకి పారేసిన కాంగ్రెస్ ఎంపి ప్రియాంక

గాంధీ పేరు మార్పంపై మండిపడ్డ శశిథరూర్

ప్రభుత్వ తీరుకు నిరసనగా విపక్ష సభ్యుల వాకౌట్



2లో

పథకాల పేర్లను మార్చడం అంటే మోదీ ప్రభుత్వానికి ఎందుకంత ఇష్టమో అర్థం కావట్లేదని అన్నారు. ఎంజీ నరేగా చట్టం పేద ప్రజలకు 100 రోజుల ఉపాధి హామీ కల్పిస్తోంది. ఈ కొత్త బిల్లుతో ప్రస్తుత చట్టాన్ని బలహీనపర్చే ప్రయత్నం చేస్తున్నారు. ఈ బిల్లులో ఒకటో, రెండో కొత్త విషయాలు చేర్చారు. పని దినాలను పెంచారు. అంతేగానీ.. వేతనాన్ని పెంచారా అని ప్రియాంక ప్రశ్నించారు.

## జీహెచ్ఎంసీ కౌన్సిల్‌లో వార్డుల పునర్విభజనపై రచ్చ

ఎంఐఎం-బీజేపీ కార్పొరేటర్ల మధ్య వాగ్వాదం

గెజిట్ పత్రాలు చింపి మేయర్ పోడియం వద్దకు దూకుడు

కౌన్సిల్ వాయిదా.. బయట బీజేపీ ఆందోళన



హైదరాబాద్,: జిహెచ్ఎంసి ప్రత్యేక కౌన్సిల్ సమావేశం రసాభాసగా మారింది. ఈ సమావేశంలో ప్రధానంగా వార్డుల పునర్విభజన అంశంపై చర్చ కొనసాగింది. జీహెచ్ఎంసీ పరిధిలో ఇటీవల విలీనం చేసిన 27 మునిసిపాలిటీలతో పాటు, ప్రస్తుతం ఉన్న 150 వార్డులను 300 వరకు పెంచేందుకు ప్రభుత్వం చేపట్టిన డీలిమిటేషన్‌పై బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం కార్పోరేటర్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. చర్చల సమయంలో సభలో ఒక్కసారిగా గందరగోళం నెలకొంది. దారుస్సలంలో వార్డుల విభజన జరిగిందంటూ బీజేపీ కార్పోరేటర్లు చేసిన వ్యాఖ్యలపై ఎంఐఎం కార్పోరేటర్లు అభ్యంతరం తెలిపారు. దీంతో ఎంఐఎం, బీజేపీ కార్పోరేటర్ల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో బీజేపీ కార్పోరేటర్లు గెజిటెడ్ పత్రాలను చింపి సభలో విసిరివేసి, మేయర్ పోడియం వైపు దూసుకెళ్లారు. దీనిపై మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గందరగోళం మధ్య పునర్విభజనపై కార్పోరేటర్ల నుంచి వచ్చిన అభిప్రాయాలు, అభ్యంతరాలను ప్రభుత్వానికి నివేదిస్తామని మేయర్ ప్రకటించారు. అనంతరం ప్రత్యేక కౌన్సిల్ సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. సభ వాయిదా అనంతరం బీజేపీ కార్పోరేటర్లు జీహెచ్ఎంసీ కార్యాలయం ముందు బైఠాయించి ఆందోళనకు దిగారు. రేవంత్ సర్కార్ ఎంఐఎంకు అనుకూలంగా వార్డుల విభజన చేపట్టిందని, జీహెచ్ఎంసీ విడుదల చేసిన మ్యాప్ తప్పుల తడకగా ఉందని ఆరోపించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో అక్కడ భారీగా పోలీసు బలగాలను మోహరించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద భాజపా కార్పొరేటర్లు నిరసన చేపట్టారు. డివిజన్ చోరీ జరిగిందంటూ ఆందోళన నిర్వహించారు. జీహెచ్ఎంసీ విడుదల చేసిన మ్యాప్ తప్పులతడకగా

ఉందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. డివిజన్ల పునర్విభజన గెజిట్ పత్రాలను చించేశారు. అంతకుముందు ఈ అంశంపై ఎమ్మెల్యేలు దానం నాగేందర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌తో పాటు కార్పొరేటర్లు మాట్లాడారు. డీలిమిటేషన్‌పై తమ అభ్యంతరాలను సభ దృష్టికి తీసుకెళ్లారు.



## హైదరాబాద్‌కు ఐఐఎంను ఇవ్వండి

అవసరమైన 200 ఎకరాల భూమి ఇస్తాం

ట్రాన్సిట్ క్యాంపస్‌లో వెంటనే తరగతులు ప్రారంభం

ఐఐఎం ఏర్పాటుకు అవసరమైన అనుమతులు మంజూరు

జిల్లాలకు అనుగుణంగా 9 కేంద్రీయ విద్యాలయాలు

16 జవహర్ నవోదయ విద్యాలయాలను మంజూరు చేయండి

కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు సీఎం రేవంత్ వినతి

దేశంలోని అన్ని ప్రాంతాలకు రాకపోకలు సాగించేందుకు వీలుగా హైదరాబాద్‌కు ఎయిర్, రైల్, రోడ్ కనెక్టివిటీ ఉందని, అనుకూల వాతావరణం, భిన్న రంగాల ప్రముఖులను అందజేసిన చరిత్ర హైదరాబాద్‌కు ఉందని కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు. హైదరాబాద్ లో ఐఐఎం ఏర్పాటు చేస్తే అది తెలంగాణ రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన పిల్లల అవకాశాలను మెరుగుపర్చుతుందని సీఎం అన్నారు. తెలంగాణలో పెరిగిన జిల్లాల సంఖ్యకు అనుగుణంగా నూతనంగా 9 కేంద్రీయ విద్యాలయాలు, 16 జవహర్ నవోదయ విద్యాలయాలను మంజూరు చేయాలని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

2లో

వేగుచుక్క

## పోలీసులకు చిక్కిన 17మంది మావోలు

**పట్టుబడ్డ వారిలో కీలక నేత చొక్కారావు?**

ఆదిలాబాద్: మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పటికే అనేక మంది మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌లో మృతిచెందగా.. భారీ సంఖ్యలో మావోలు లొంగిపోయారు. ఇప్పుడు తాజాగా మావోయిస్టు కీలక నేత పోలీసులకు చిక్కినట్లు తెలుస్తోంది. మావోయిస్టు అధినేత చొక్కరావును పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మంగళవారం ఆదిలాబాద్ జిల్లాలోని సిర్పూర్ (యూ )లో 15 మంది మావోయిస్టులు పోలీసులకు చిక్కారు. పట్టుబడ్డ వారిలో 9 మంది మహిళలు ఉండగా 7 పురుషులు ఉన్నట్టు సమాచారం. అలాగే వారిలో మావో అగ్రనేత బడే చొక్కారావు అలియాస్ దామోదర్ కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వారందనీ హైదరాబాద్ డీజీపీ కార్యాలయానికి తరలిస్తున్నారు. మావోయిస్టులు పట్టుబడటంపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.ద

## గాంధీ అన్నా..పేదలన్నా మోడీకి నచ్చదు



న్యూఢిల్లీ:మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టాన్ని రద్దు చేస్తూ దాని స్థానంలో కేంద్రం కొత్త చట్టాన్ని తీసుకురావడానికి బిల్లు ప్రవేశపెట్టడాన్ని విపక్ష కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శించారు. మహాత్మా గాంధీ ఆదర్శాలను అవమానించచమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంటోందని దుయ్యబట్టారు. ఉద్యోగాలు ఇవ్వకుండా యువత భవిష్యత్తును నాశనం చేసిన మోదీ ప్రభుత్వం..ఇప్పుడు గ్రామీణ ప్రజలకు కూడా ఉపాధి లేకుండా చేస్తోందని మండిపడ్డారు. ఈ ప్రజా వ్యతిరేక బిల్లుకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు ర్యాలీగా పార్లమెంటు వరకు వెళ్లి తమ నిరసనను తెలియజేస్తాయన్నారు. మహాత్మా గాంధీ ఆలోచనలు, పేదల హక్కులపై ప్రధాని మోదీకి ముందు నుంచి తీవ్రమైన అయిష్టత ఉంది. గ్రామ స్వరాజ్యాన్ని తీసుకురావాలనే గాంధీ ఆలోచనకు ఎంజీ నరేగా ఓ సజీవ స్వరూపం. ఎన్నో ఏళ్లుగా ఇది లక్షలాది మంది గ్రామీణ ప్రజలకు జీవనాడిగా ఉంది. కొవిడ్ సమయంలో కూడా ఈ పథకం పేదలకు ఆర్థిక భద్రతను ఇచ్చింది. కాంగ్రెస్ తీసుకువచ్చిన ఎంజీ నరేగా ప్రధాని మోదీని ఎప్పుడూ కలవరపెడుతూనే ఉంది. కాబట్టి దీనిని బలహీనపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం పదేళ్లుగా ప్రయత్నిస్తోంది. అందులో భాగంగానే దీనిని పూర్తిగా తుడిచిపెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారని రాహుల్ సోషల్ మీడియాలో రాసుకొచ్చారు. ప్రస్తుతం ఉన్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో కేంద్రం కొత్త బిల్లును తీసుకురావాలని యోచిస్తున్న సమయంలో, కేంద్ర ప్రభుత్వంపై ప్రతిపక్ష ఎంపీ రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇది మహాత్మాగాంధీ ఆదర్శాలకు అవమానమని అన్నారు. గ్రామీణ కుటుంబాలకు ప్రతీ ఏడాది 100 రోజుల వేతన ఉపాధికి చట్టపరమైన హామీని అందించే పథకాన్ని రద్దు చేయాలని మోడీ సర్కార్ యోచిస్తోందని మండిపడ్డారు. కేంద్రం కొత్తగా రోజ్‌గార్ మరియు అజీవిక మిషన్ బిల్లు, 2025ను తీసుకురావడంపై ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ప్రధాని మోడీకి రెండు విషయాలు నచ్చవని, మహాత్మా గాంధీ ఆలోచనలు, పేదల హక్కులు నచ్చవని ఎక్స్‌లో ఆరోపించారు. కేంద్రం తీసుకురాబోతున్న కొత్త బిల్లుకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు రోడ్ల నుంచి పార్లమెంట్ వరకు నిరసన తెలుపుతాయని ఆయన అన్నారు.



## నరేగా రద్దు..పార్లమెంటు ముందుకు కొత్త చట్టం

న్యూఢిల్లీ: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టం ఎంజీ నరేగా రద్దుపై పార్లమెంటులో తీవ్ర గందరగోళం చెలరేగింది. నరేగా రద్దును నిరసితిస్తూ విపక్ష సభ్యులు స్పీకర్ పోడియం వద్దకు వచ్చి ఆందోళనకు దిగారు. ఇది గాంధీని అవమానించడమేనని అన్నారు. నరేగా స్థానంలో కేంద్రం కొత్త చట్టాన్ని తీసుకొస్తున్న సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించిన 'వికసిత్ భారత్ రోజ్‌గార్, ఆజీవికా హామీ మిషన్ (గ్రామీణ్) (వీబీ-జీ రామ్ జీ) బిల్లు- 2025'ను కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్ మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లును ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ మాట్లాడుతూ కేంద్రంపై విమర్శలు గుప్పించారు. ఇది ఎంజీ నరేగా చట్టాన్ని బలహీనపర్చడమేనని దుయ్యబట్టారు. ప్రభుత్వ పథకాల పేర్లను మార్చడం అనేది చాలా ఖర్చుతో కూడుకున్న పని. అయినా కేంద్రం మారుస్తూనే ఉంది. పథకాల పేర్లను మార్చడం అంటే మోదీ ప్రభుత్వానికి ఎందుకంత ఇష్టమో అర్థం కావట్లేదని అన్నారు. ఎంజీ నరేగా చట్టం పేద ప్రజలకు 100 రోజుల ఉపాధి హామీ కల్పిస్తోంది. ఈ కొత్త బిల్లుతో ప్రస్తుత చట్టాన్ని బలహీనపర్చే ప్రయత్నం చేస్తున్నారు. ఈ బిల్లులో ఒకటో, రెండో కొత్త విషయాలు చేర్చారు. పని దినాలను పెంచారు. అంతేగానీ.. వేతనాన్ని పెంచారా అని ప్రియాంక ప్రశ్నించారు. గతంలో గ్రామ పంచాయతీలు ఈ పథకం కింద పని చేయించేవి. ఇప్పుడు కొత్త బిల్లుతో పంచాయతీలకు ఆ హక్కును దూరం చేస్తున్నారు. ఇక, ఈ బిల్లుతో ఉపాధి హామీ పథకంపై కేంద్రం నియంత్రణను పెంచి, నిధులను తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు. ఎవరి ఇష్టానుసారం గానో బిల్లులను ఆమోదించుకుంటామంటే కుదరదు. ఈ బిల్లును తక్షణమే కేంద్రం ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక అన్నారు. ప్రియాంక మాట్లాడుతుండగా.. ట్రెజరీ బెంచ్‌లో కొందరు 'ఫ్యామిలీ' అంటూ వ్యాఖ్యలు చేశారు. దీనికి ఆమె స్పందిస్తూ.. మహాత్మా గాంధీ మా కుటుంబానికి చెందిన వ్యక్తి కాదు కానీ, మా కుటుంబసభ్యుడితో సమానం. గాంధీజీని యావత్ దేశం అలాగే భావిస్తోందని కౌంటర్ ఇచ్చారు. అనంతరం టీఎంసీ ఎంపీ సౌగతా రాయ్ మాట్లాడుతూ రాముడి పేరుతో కేంద్రం దోపిడీకి పాల్పడుతోందని దుయ్యబట్టారు. ఉద్దేశపూర్వకంగా గాంధీ పేరును తొలగించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.

అయితే, విపక్షాల ఆరోపణలను కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్ తిప్పికొట్టారు. మహాత్మాగాంధీ అంటే తమకు ఎంతో గౌరవమని, ఆయన సిద్ధాంతాలను తమ ప్రభుత్వం పాటిస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం గత ప్రభుత్వాల కంటే మోదీ సర్కారు ఎంతో కృషి చేసిందని తెలిపారు. పేదల సంక్షేమం, ఉపాధి పెంపు కోసమే ఈ బిల్లును తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ బిల్లుపై లోక్‌సభలో గందరగోళ వాతావరణం నెలకొంది. కేంద్రం తీరును నిరసిస్తూ విపక్షాలు వెల్‌లోకి దూసుకెళ్లి ఆందోళన చేపట్టాయి. అనంతరం గాంధీజీ ప్లకార్డులు ప్రదర్శిస్తూ సభ నుంచి వాకౌట్ చేశాయి. అంతకుముందు కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ కూడా ఈ బిల్లును వ్యతిరేకించారు. ఈ పథకానికి గాంధీ పేరును తొలగించడం అనైతికమని అన్నారు. అంతేగాక, రాముడి పేరును అపవిత్రం చేయొద్దంటూ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

సోమవారం కూడా థరూర్ ఈ పేరు మార్పుపై ఎక్స్ వేదికగా స్పందించారు. ఎంజీనరేగా పేరు మార్చి.. కేంద్రం కొత్తగా జీ రామ్ జీ బిల్లు తీసుకురావడంపై జరుగుతున్న వివాదం దురదృష్టకరం. గ్రామ స్వరాజ్ సిద్ధాంతాలు, రామరాజ్య ఆదర్శాలు ఎన్నటికీ ఒకదానితో ఒకటి పోటీపడేవి కాదు. గాంధీజీ దృక్పథానికి అవి రెండు మూల స్తంభాల్లాంటివి. ఇప్పుడు పథకానికి పేరు మార్చడం అంటే ఆయన ఆదర్శాలను విస్మరించినట్లే. ఆయన వారసత్వాన్ని అగౌరపర్చే ప్రయత్నం చేయొద్దని థరూర్ అన్నారు.

శశిథరూర్ గత కొంతకాలంగా కాంగ్రెస్ తో విభేదిస్తూ మోదీ ప్రభుత్వంపై బహిరంగంగానే ప్రశంసలు కురిపిస్తోన్న సంగతి తెలిసిందే. దీంతో సొంత పార్టీ నేతల ఆగ్రహానికి గురవుతున్నారు. ఈ క్రమంలోనే తాజాగా బిల్లు విషయంలో కాంగ్రెస్‌కు మద్దతుగా మాట్లాడటం ప్రాధాన్యం సంతరించుకుంది.

## కాంగ్రెస్ నేతలు దౌర్జన్యాం

**హైదరాబాద్:** గ్రామాల్లో కాంగ్రెస్ నేతలు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు వ్యవహరిస్తున్న తీరు అత్యంత దారుణమని మండిపడ్డారు. ప్రజల ప్రాణాలు పోతుంటే పోలీసులు చేష్టలుడిగి చూడటం పద్ధతి కాదన్నారు. పోలీసులు నిందితులపై చర్యలు తీసుకోకపోతే తిరగబడాల్సి వస్తుందని హెచ్చరించారు. నిజామాబాద్ జిల్లా సోమార్‌పేట్‌లో కాంగ్రెస్ గూండాల దాడిలో తీవ్రంగా గాయపడి సికింద్రాబాద్ యశోద దవాఖానలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి బిట్ల బాలరాజు, అతని భార్య గంజి భారతిని కేటీఆర్ పరామర్శించారు. ఈ సందర్భంగా వారికి ధైర్యం చెప్పి, వైద్య ఖర్చులు పార్టీనే భరిస్తుందని.. అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ గూండాలు ఇష్టమొచ్చి నట్టు దాడులకు తెగబడుతుంటే.. పోలీసులు నిశ్చేష్టులుగా వ్యవహరి స్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితులపై చర్యలు తీసుకోకపోతే తాము కూడా తిరగబడాల్సి వస్తుందన్నారు. ఇక దాడికి ప్రతిదాడే సమాధానం అనుకుంటే, రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందని, అప్పుడు జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. రాష్ట్రంలో పోలీసులు వ్యవహరిస్తున్న అత్యంత దారుణంగా ఉందన్నారు. డీజీపీ స్థాయి నుంచి కిందిస్థాయి పోలీస్ అధికారుల వరకు అందరికీ గుర్తు చేస్తున్నా.. మీకు జీతాలు ఇస్తున్నది ప్రజల సొమ్ముతోనే. రేవంత్ ఇంట్లో సొమ్ముతోనే, కాంగ్రెస్ సొమ్ముతోనే కాదు.

## హైదరాబాద్‌కు ఐఐఎంను ఇవ్వండి



**న్యూఢిల్లీ:** హైదరాబాద్‌లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఐఐఎంను మంజూరు చేయాలని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. టెక్నాలజీ, లైఫ్ సైన్సెస్, ఏరో స్పేస్, డిఫెన్స్, లాజిస్టిక్స్, అడ్వాన్స్డ్ మాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లో ముందున్న హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని సీఎం తెలిపారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో పార్లమెంట్‌లోని ఆయన ఛాంబర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం భేటీ అయ్యారు. దేశంలో 19 రాష్ట్రాల్లో 1 కేంద్ర పాలిత ప్రాంతంలో కలిపి 21 ఐఐఎంలు ఉన్నాయని, తెలంగాణ రాష్ట్రంలోనూ ఐఐఎం ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. ఐఐఎం ఏర్పాటుకు అవసరమైన 200 ఎకరాల భూమిని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రాంగణంలో గుర్తించామని సీఎం కేంద్ర మంత్రికి తెలిపారు. ఐఐఎం తరగతులు వెంటనే ప్రారంభించేందుకు ట్రాన్సిట్ క్యాంపస్ సిద్ధంగా ఉందని కేంద్ర మంత్రి సీఎం వెల్లడించారు. ఐఐఎం ఏర్పాటుకు అవసరమైన అనుమతులు వెంటనే మంజూరు చేయడంతో పాటు అవసరమైన వసతులు కల్పనకు తాము సిద్ధంగా ఉన్నట్లు సీఎం తెలిపారు. దేశంలోని అన్ని ప్రాంతాలకు రాకపోకలు సాగించేందుకు వీలుగా హైదరాబాద్‌కు ఎయిర్, రైల్, రోడ్ కనెక్టివిటీ ఉందని, అనుకూల వాతావరణం, భిన్న రంగాల ప్రముఖులను అందజేసిన చరిత్ర హైదరాబాద్‌కు ఉందని కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు. హైదరాబాద్ లో ఐఐఎం ఏర్పాటు చేస్తే అది తెలంగాణ రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన పిల్లల అవకాశాలను మెరుగుపర్చుతుందని సీఎం అన్నారు. తెలంగాణలో పెరిగిన జిల్లాల సంఖ్యకు అనుగుణంగా నూతనంగా 9 కేంద్రీయ విద్యాలయాలు, 16 జవహర్ నవోదయ విద్యాలయాలను మంజూరు చేయాలని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. పెరుగుతున్న పట్టణీకరణ, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కేంద్రీయ విద్యాలయాలు, జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటు అవసరం ఉందని సీఎం అన్నారు. కొమురం భీం ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, కామారెడ్డి, జోగులాంబ గద్వాల, నారాయణపేట, నాగర్‌కర్నూల్, సూర్యాపేట, వికారాబాద్, నిర్మల్ జిల్లాల్లో కేంద్రీయ విద్యాలయాలు, హనుమకొండ, జనగాం, జయశంకర్ భూపాలపల్లి, జోగులాంబ గద్వాల, మహబూబాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, మెదక్, ములుగు, నారాయణపేట, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, వనపర్తి, యాదాద్రి భువనగిరి, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలో జవహర్ నవోదయ విద్యాలయాలు వెంటనే ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. కేంద్రీయ విద్యాలయాలు, జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు అవసరమైన స్థలం, ఇతర వసతులు కల్పించడానికి తాము సిద్ధంగా ఉన్నామని సీఎం కేంద్ర మంత్రికి తెలిపారు. సమావేశంలో ఎంపీలు డాక్టర్ మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, మందాడి అనిల్ కుమార్, ఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి పాల్గొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటన కొనసాగుతోంది. మంగళవారం కేంద్రమంత్రులు నిర్మలా సీతారామన్, ధర్మేంద్ర ప్రధాన్‌తో ఆయన భేటీ అయ్యారు. తెలంగాణ విజన్ డాక్యుమెంట్‌ను నిర్మలా సీతారామన్‌కు సీఎం అందజేశారు. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లకు పెట్టే ఖర్చును ఎఫ్ఆర్‌బీఎం పరిధి నుంచి తొలగించాలని రేవంత్ కోరారు. యంగ్ ఇండియా స్కూళ్ల ప్రాజెక్టు డీపీఆర్‌ను పంపాలని ముఖ్యమంత్రికి కేంద్ర మంత్రి సూచించారు. దాన్ని పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

## ఎంజి నరేగా పేరు మార్చడం దారుణం

న్యూఢిల్లీ: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం చారిత్రాత్మకమని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అభివర్ణించారు. ఇలాంటి పథకానికి పేరు మార్చి వికసిత భారత్ - జీ రామ్ జీగా ప్రస్తుతం నామకరణం చేశారని మంగళవారం న్యూఢిల్లీలో ఆయన విమర్శించారు. మహాత్మా గాంధీ పేరు తొలగించడం ఆర్‌ఎస్‌ఎస్ - బీజేపీ ఆలోచనకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ పథకాన్ని బలపర్చకుండా నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తున్నారంటూ మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ ఎంపీ నిప్పులు చెరిగారు. కేంద్ర - రాష్ట్ర నిధుల వాటా 40:60గా మార్చడంతో రాష్ట్రాలపై భారం పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రాల్లో నిధులు లేకపోతే పథకం అమలు కష్టమయ్యే పరిస్థితి ఉందన్నారు. 125 రోజులు అంటూనే ఉపాధి హామీని అస్పష్టంగా మార్చారంటూ కేంద్రంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పథకానికి దేవుడి పేరు పెట్టి ప్రజలను తప్పు దోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారంటూ కేంద్రం తీరును ఈ సందర్భంగా ఆయన ఎండగట్టారు. మహాత్మా గాంధీ పేరును చరిత్ర నుంచి తొలగించాలన్న ఉద్దేశంతోనే ఇలా చేశారని విమర్శించారు. పథకం పేరుతోపాటు అమలులో తీసుకు వచ్చిన మార్పులకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళనలకు కాంగ్రెస్ పార్టీ దిగుతుందని ఎంపీ చామల స్పష్టం చేశారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ హయాంలో 2005లో ఉపాధి హామీ పథకం ప్రారంభమైందని గుర్తు చేశారు. గ్రామీణ పేద ప్రజలకు 100 రోజుల గ్యారెంటీ ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో అప్పటి కేంద్రం 100శాతం నిధులు కేటాయించిందని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి గుర్తు చేశారు. మరోవైపు నేషనల్ హెరాల్డ్ కేసులో పోలీస్, ఆర్థిక నేరాల విభాగం దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టివేసిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఈ కేసులో ఎలాంటి ఆర్థిక లావాదేవీలు లేవని కోర్టు సైతం స్పష్టం చేసిందని తెలిపారు. రాహుల్, సోనియా గాంధీలపై కక్ష సాధింపు రాజకీయాలే లక్ష్యంగా ఈడీ కేసు నమోదు చేసిందని ఆరోపించారు. బలమైన ప్రాంతీయ నాయకత్వాన్ని నిర్వీర్యం చేయడానికే కేంద్ర సంస్థలను దుర్వినియోగం చేస్తోందంటూ బీజేపీపై ఎంపీ చామల ఆగ్రహం వ్యక్తం చేశారు.

## కొత్త సర్పంచ్‌లు గ్రామాభివృద్ధిలో దూకాలి



ఖమ్మం: కొత్తగా ఎన్నికైన సర్పంచులు గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు. గ్రామాల్లో పారిశుధ్యం, విద్య, వైద్య సేవల మెరుగుదలపై సర్పంచులు ప్రధానంగా దృష్టి సారించాలన్నారు. రాజకీయాలకు అతీతంగా పనిచేస్తూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాల్సిన బాధ్యత సర్పంచులపై ఉందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మధిర నియోజకవర్గంలో ఇటీవల ఎన్నికైన సర్పంచులను భట్టి విక్రమార్క ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రాన్ని 2047 నాటికి ప్రపంచంతో పోటీపడే స్థాయిలో నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు. గ్లోబల్ సమ్మిట్‌లో 2047 విజన్ డాక్యుమెంట్‌ను ప్రదర్శించినట్లు చెప్పారు. 2047 కల్లా రాష్ట్రంలో ఒక లక్ష 30 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా పనిచేస్తున్నామని వెల్లడించారు.తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో 5 లక్షల 70 వేల కోట్ల రూపాయల పెట్టుబడి ఒప్పందాలు కుదిరినట్లు భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు పోటీ పడుతున్నారని పేర్కొన్నారు. మధిర నియోజకవర్గంలో మొత్తం 131 గ్రామపంచాయతీలకు గాను 90 గ్రామపంచాయతీలలో కాంగ్రెస్ మద్దతు ఉన్న అభ్యర్థులు గెలవడం చరిత్రలో ఒక మైలురాయిగా అభివర్ణించారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రస్తావిస్తూ, రాష్ట్రంలో 93 లక్షల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. మహిళలకు 20 వేల కోట్ల రూపాయలతో వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని, రైతులకు 9 వేల కోట్ల రూపాయలతో రైతు భరోసా అందజేస్తున్నామని చెప్పారు. 2047 నాటికి తెలంగాణను ప్రపంచంలో నెంబర్ వన్ రాష్ట్రంగా నిలబెట్టడమే ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మరోసారి స్పష్టం చేశారు.

## ఇంటర్ పరీక్షలో స్వల్ప మార్పు



### మార్చి 3 నాటి పరీక్ష 4కు వాయిదా

హైదరాబాద్: తెలంగాణ ఇంటర్ పరీక్షల షెడ్యూల్‌లో స్వల్ప మార్పు చోటు చేసుకుంది. మార్చి 3న జరగాల్సిన ఇంటర్ సెకండియర్ మ్యాథ్స్ 2ఏ, బోటనీ, పొలిటికల్ సైన్స్ పరీక్షలను మరుసటి రోజు అంటే మార్చి 4న నిర్వహించనున్నట్లు తెలిపింది. మార్చి 3న హోలీ పండగ ఉండటంతో పరీక్షల తేదీలో మార్పు చేసినట్లు వెల్లడించింది. మిగతా పరీక్షలు యథాతథంగా నిర్వహించనున్నట్లు పేర్కొంది. ఇప్పటికే పరీక్షల షెడ్యూల్ విడుదలయ్యింది.

## గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా పంచాయితీ ఎన్నికలు

హైదరాబాద్: తెలంగాణలో రెండు విడతల్లో ఇప్పటివరకు 8,566 పంచాయతీల్లో ఎన్నికలు విజయవంతంగా పూర్తయ్యాయని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క తెలిపారు.బీసీ కులగణన ఆధారంగా 42 శాతం రిజర్వేషన్ లక్ష్యంతో కేంద్రంపై పోరాటం కొనసాగుతూనే ఉంది. గ్రామాలకు పూర్తి స్థాయి నిధులు అందాలనే ఉద్దేశంతో ఎన్నికలు నిర్వహించాం అని అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సహచర మంత్రుల నాయకత్వంలో ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ గ్రామస్థాయిలో సత్తా చాటిందన్నారు. సమ్మక్క-సారలమ్మ జాతర, ఆదివాసీ సంస్కృతి, ఆత్మగౌరవంపై తప్పుడు వ్యాఖ్యలు చేసి, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ సహించదు. రాళ్లు కాదు.. రాతి శిలలపై చెక్కిన చరిత్రే ఆదివాసీ అస్థిత్వానికి నిదర్శనం. ఇళ్ల విషయంలో భారత రాష్ట్ర సమితి నాయకులు కావాలని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. పదేళ్లు అధికారంలో ఉండి పది ఇళ్లయినా ఇవ్వలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం గత ఏడాదిన్నరలో కొన్ని వేల ఇళ్లు ఇచ్చిందని అన్నారు. మహిళలకు చీరలు, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, పేద పిల్లలకు గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగాలు వస్తే కొందరికి కళ్లమంటగా మారింది. తాడ్వాయి ప్రాంతంలో ఆదివాసీ మహిళ గెలిస్తే భూములు లాగేసుకుంటారని ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేయడం నీచమైన రాజకీయం. మా ఆదివాసీ దేవుళ్ల జోలికి వచ్చినా, మా అస్థిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసినా ఊరుకునేది లేదని మంత్రి సీతక్క హెచ్చరించారు.

## వైసిపి కోటి సంతకాల సేకరణ బూటకం

విజయవాడ: వైసీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ నాటకమంతా ఒక బూటకమని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అభివర్ణించారు. మెడికల్ కాలేజీల నిర్మాణానికి.. ప్రవేటీకరణకు ఉన్న వ్యత్యాసాన్ని సైతం గుర్తించకుండా దుష్ప్రచారం చేస్తోందంటూ వైసీపీపై ఆయన నిప్పులు చెరిగారు. ఈ పీపీపీ విధానం వల్ల కలిగే ప్రయోజనాలను ఆయన సోదాహరణగా వివరించారు. ఒక్కో మెడికల్ కాలేజీలో 250 యూజీ సీట్లు పెంచుకునే వెసులుబాటు ఉందని తన నివేదికలో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ స్పష్టం చేసిందని గుర్తు చేశారు. రాష్ట్రంలోని వైద్య కళాశాలల వ్యవహారంలో పీపీపీ విధానంలో వెళ్లాలని చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయాన్ని వైసీపీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ.. ఆ పార్టీ కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించింది. అలాంటి వేళ పీపీపీ విధానంలో వైద్య కళాశాలల నిర్మాణంపై పార్లమెంట్ స్థాయి సంఘం పలు సిఫార్సులు చేసింది. దీనిపై రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మంగళవారం విజయవాడలో స్పందించారు. ఈ సిఫార్సులు వైసీపీకి చెంపపెట్టు అని ఆయన స్పష్టం చేశారు. వైద్య విద్య ఖర్చు విపరీతంగా పెరిగిపోతున్న క్రమంలో.. ఎక్కువ మందికి వైద్య విద్య అందించాలంటే ఈ విధానం తప్ప మరో ప్రత్యామ్నాయం లేదని కేంద్రం స్పష్టం చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. మెడికల్ కాలేజీల నిర్మాణంపై హైకోర్టు సమర్థించినా ప్రతిపక్ష నేతల్లో మార్పు కనిపించక పోవడం దురదృష్టకరమని చెప్పారు. మెడికల్ కాలేజీల నిర్మాణంపై ఎక్కడైనా చర్చకు తమ కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని వైసీపీ నేతలకు మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సవాల్ విసిరారు. మెడికల్ కాలేజీల నిర్మాణం చేపట్టడం ద్వారా వైద్య విద్య మెరుగుపడటంతోపాటు నిరుపేదలకు మెరుగైన వైద్యం సాయం అందించగలమని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. అదనంగా 220 సీట్లు రాష్ట్రంలో పెరగడంతో పాటు, 110 సీట్లు ప్రభుత్వ (కన్వీనర్) కోటాలో పెరగనున్నాయన్నారు. వైసీపీ పాలనలో 17 మెడికల్ కాలేజీల నిర్మాణాలకు రూ. 8,400 కోట్లు ఖర్చు చేయాల్సి ఉండగా.. కేవలం రూ.1,451 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టి చేతులు దులుపుకున్నారని వివరించారు. 151 సీట్లతో ప్రజలు అధికారం కట్టబెడితే, 17 మెడికల్ కాలేజీలు నిర్మించలేని.. మీరు నేడు ప్రజలను మభ్య పెట్టేందుకు ప్రయత్నించడం సిగ్గుచేటు అంటూ వైసీపీ నేతల వైఖరిని ఆయన ఎండగట్టారు.

# రామన్ మ్యాథ్స్ లో "నలంద"కు రాష్ట్ర స్థాయి ర్యాంకులు.







- విద్యార్థులను అభినందించిన పాఠశాల యాజమాన్యం ప్రసాద్, సాగర్.







**వేగుచుక్క న్యూస్, ఆర్మూర్:**

పట్టణంలోని మామిడిపల్లి లో గల నలంద హై స్కూల్ విద్యార్థులు రామన్ మ్యాథ్స్ మహోత్సవ్ ఐఐటి రాష్ట్ర స్థాయి పరీక్షలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. రాష్ట్ర స్థాయి పరీక్షలో మొదటి ర్యాంకు కూడా నలంద విద్యార్థికి రావడం పట్ల యాజమాన్యం ప్రసాద్ , సాగర్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం పాఠశాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తూ, ఘనంగా సన్మానించారు. రాష్ట్ర స్థాయి 1వ ర్యాంక్ శ్రీమహాలక్ష్మి (4వ తరగతి), శివమణి శంకర్ (6వ తరగతి) సాధించారు. అలాగే రాష్ట్ర స్థాయి 4వ ర్యాంక్ కె. నితిష (8వ తరగతి), పి. నితిష (8వ తరగతి), రాష్ట్ర స్థాయి 5వ ర్యాంక్: సాక్షిత (5వ తరగతి), కె. రుషిక( 7వ తరగతి), పి. హరిణి (8వ తరగతి), హృద్య శ్రీ (8వ తరగతి), నహిద (8వ తరగతి), అశ్విత (8వ తరగతి), అబ్దుల్ అర్హాన్ (8వ తరగతి), శ్రీకర్ (8వ తరగతి) సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం ప్రసాద్, సాగర్ మాట్లాడుతూ, తమ విద్యార్థుల పట్టుదల, సిబ్బంది కృషి వల్ల ఉత్తమ ర్యాంకులు లభించాయని అన్నారు. విద్యా నైపుణ్యాన్ని పెంపొందించడంలో ఉపాధ్యాయుల నిబద్ధతతో కూడిన కృషిని, తల్లిదండ్రుల నిరంతర మద్దతు మరచిపోలేనిదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అభివృద్ధిలో "ఆదర్శ నియోజకవర్గం"గా తీర్చిదిద్దాలి.

అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ.
వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం.



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**

రాష్ట్రంలోనే అభివృద్ధిలో అర్బన్ ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ సూచించారు. నగరంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, అలాగే ఇటీవల టియుఎఫ్ఐడిసి ఆధ్వర్యంలో జరుగుతున్న పనుల పురోగతిపై మంగళవారం సంబంధిత శాఖల అధికారులతో సుభాష్ నగర్ లోని అర్బన్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా సమావేశంలో ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడుతూ, నగరంలోని రహదారుల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ, త్రాగునీటి సరఫరా, పారిశుద్ధ్య పనులు, టియుఎఫ్ఐడిసి ద్వారా చేపడుతున్న పనుల నాణ్యత, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల పురోగతిపై విస్తృతంగా సమీక్షించారు. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో రాష్ట్రంలోనే నెంబర్ వన్ గా తీర్చిదిద్దే బాధ్యత నియోజకవర్గానికి చెందిన ప్రతి ఒక్క అధికారి బాధ్యత అని ఆయన గుర్తు చేశారు. ముఖ్యంగా తన నియోజకవర్గంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ దిలీప్ కుమార్, మున్సిపల్ ఇఇ సుదర్శన్ రెడ్డి, రోడ్లు భవనాల శాఖ డిఈ ప్రవీణ్, పబ్లిక్ హెల్త్ అధికారి డిఈ నగేశ్ రెడ్డి, పబ్లిక్ హెల్త్ అధికారి ఏఈ శివకృష్ణ తదితర మున్సిపల్, ఆర్ అండ్ బి, పబ్లిక్ హెల్త్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ చట్టం రద్దుకు కేంద్రం కుట్రలు.

- ఎఐయుకెఎస్ రాష్ట్ర అధ్యక్షులు వి. ప్రభాకర్.

**వేగుచుక్క న్యూస్, కమ్మర్ పల్లి**




మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం రద్దుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందని ఎఐయుకెఎస్ రాష్ట్ర అధ్యక్షులు వి. ప్రభాకర్ ఆరోపించారు. మంగళవారం కమ్మర్పల్లి మండల కేంద్రంలో సిపిఐ ఎంఎల్ (ప్రజా పంథా) మాస్ లైన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ప్రభాకర్ మాట్లాడారు. దేశవ్యాప్తంగా యంత్ర పరికరాలు రావడంతో వ్యవసాయాన్ని నమ్ముకొని ఉన్న కోట్లాదిమంది కూలీలు ఉపాధి కోల్పోయారన్నారు. ఉపాధి నైన చూపండి, సాగుభూములైన ఇవ్వండి అని, ఆందోళన కార్యక్రమాలు కొనసాగాయన్నారు. దీని ఫలితంగా మొదటి యుపిఏ సర్కారు హయంలో వామపక్ష పార్టీల ప్రతిపాదన మేరకు మాహత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రూపొందించడం జరిగిందనీ అన్నారు. ఈ చట్టం వ్యవసాయ కూలీలకు కనీస వేతన చట్టం అమలు, పని గ్యారంటీ, పని కోరిన వారికి పని కల్పించలేక పోతే నిరుద్యోగ భృతి, పని స్థలాల్లో ప్రమాదం లో మరణిస్తే నష్టపరిహారం చెల్లించే విధంగా చట్టంలో రక్షణ కల్పించారనీ వివరించారు. ఈ చట్టం పరిధిలో 90 శాతం నిధులు కేంద్ర ప్రభుత్వం భరించాలి, 10 శాతం రాష్ట్ర ప్రభుత్వాలు భరించాలనీ నిర్దిష్టంగా పేర్కొందన్నారు. కానీ 2014 లో అధికారంలోకి వచ్చిన బిజెపి మోడీ సర్కార్ ఉపాధి హామీ చట్టానికి తూట్లు పోవడం ప్రారంభించారని అన్నారు. డిజిటల్ హాజరు పట్టికతో పాటు నిధుల కోత, చట్టంలో మార్పులు చేస్తూ, వ్యవసాయ కూలీలకు వ్యతిరేకంగా, కార్పొరేట్ శక్తులకు అనుకూలమైన విధానాలను రూపొందిస్తుందని అన్నారు. తేనె పూసిన కత్తి లాగా పని దినాలను 100 నుంచి 125 పెంచుతున్నామని, పేరు మాత్రమే మారుస్తున్నామని మోసపూరితంగా పార్లమెంట్లో ఆమోదానికి పెట్టారని అని అన్నారు. చట్టంను మార్చి స్కీముగా రూపొందిస్తే పని గ్యారంటీ పోతుందనీ, 125 రోజులు కాదు కదా 200 రోజులు పెట్టిన అమలు జరిగే పరిస్థితి ఉండదన్నారు. చట్టానికి మాత్రమే అమలు చేసుకొనే శక్తి సామర్థ్యం ఉంటుందని, స్కీములకు ఉండదని అన్నారు. గత సంవత్సరం తెలంగాణ రాష్ట్రంలో 12 కోట్ల 50 లక్షల పని దినాలు కల్పిస్తే, ఈ సంవత్సరం ఏడు కోట్ల 50 లక్షల పది దినాలు మాత్రమే ఉపాధి కూలీలకు కల్పించారన్నారు. ఇది చట్టాన్ని నీరుగార్చి పనిలో ప్రభుత్వం ఉందని అనడానికి నిదర్శనమని అన్నారు. అందుకే ఈ మార్పుని వ్యతిరేకిస్తున్నామన్నారు. 2005 ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవడానికి ఆందోళన చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం నిజామాబాద్ రూరల్, కామారెడ్డి సంయుక్త జిల్లా కమిటీ అధ్యక్షులు జి. కిషన్, ఏఐయుకెఎస్ రాష్ట్ర కార్యదర్శి బి. దేవారాం తదితరులు పాల్గొన్నారు.

## విశ్రాంత పద్మశాలి ఉద్యోగులు సమాజ సేవలో ముందుడాలి.

- రాష్ట్ర వ్యవస్థాగత కార్యదర్శి శ్రీరాందాస్ యాదగిరేందర్.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**



తెలంగాణ రాష్ట్ర పద్మశాలి ఉద్యోగుల సంఘానికి అనుబంధంగా ఉన్న తెలంగాణ రాష్ట్ర పద్మశాలి విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా బాసబత్తిని రాజేశం, ప్రధాన కార్యదర్శిగా చౌటు భూమేశ్వర్ లను నియమిస్తూ పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర వ్యవస్థాగత కార్యదర్శి శ్రీరాందాస్ యాదగిరేందర్ ఆదేశాలు జారీ చేశారు. విశ్రాంత పద్మశాలి ఉద్యోగులు పరస్పరం సహకరించుకుంటూ సమాజ సేవ చేయాలని, సమాజ అభివృద్ధికి పాటుపడాలని రాష్ట్ర అధ్యక్షులు ఈగ వెంకటేశ్వర్లు ఈ సందర్భంగా సూచించారు. తమను తెలంగాణ రాష్ట్ర పద్మశాలి విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులుగా ప్రధాన కార్యదర్శి గా నియమించినందుకు బాసబత్తిని రాజేశం, చౌటు భూమేశ్వర్ రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. సమాజ అభివృద్ధికి పద్మశాలి విశ్రాంతి ఉద్యోగుల సంక్షేమం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు.






## లారీ డ్రైవర్ పై దుండగుల కాల్పులు.

- జాతీయ రహదారి, దేవి తాండ వద్ద ఘటన.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**







జాతీయ రహదారి 44పై మంగళవారం దుండగులు జరిపిన కాల్పుల్లో లారీ డ్రైవర్ సల్మాన్ (48) హతమయ్యాడు. ఈ సంఘటన ఇందల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని దేవీతాండ వద్ద గల దాబా వద్ద చోటు చేసుకుంది. ఉత్తర ప్రదేశ్ కు చెందిన వ్యక్తి లారీలో దేవీతాండ వద్ద ఉన్న దాబా వద్ద నిలిపాడు. అక్కడికి మరో లారీలో వచ్చిన ఇద్దరు అగంతకులు సల్మాన్ పై కాల్పులు జరిపారు. దాంతో సల్మాన్ అక్కడికక్కడే మృతి చెందాడు. నిందితులు తాము ప్రయాణించిన లారీని చంద్రాయన్ పల్లి అటవీ ప్రాంతంలో వదిలేసి పరారీ అయ్యారు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. లారీ డ్రైవర్ హత్యకు పాతకక్షలే కారణమా? లేక ఇంకేమైనా నేరాల కోణం ఉందా అనే విచారణ జరుపుతున్నారు.

## జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల ఇవ్వాలి.

ప్రభుత్వ సలహాదారులు, ఎమ్మెల్యే పి. సుదర్శన్ రెడ్డికి టీయూడబ్ల్యూజె వినతి.
భూసేకరణ చేయాలని ఆర్డీఓను ఆదేశించిన ఎమ్మెల్యే.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**



జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలనీ ప్రభుత్వ సలహాదారులు, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డిని టీయూడబ్ల్యూజె (ఐజేయు) నాయకులు కోరారు. మంగళవారం సుదర్శన్ రెడ్డి నీ యూనియన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి, సన్మానించారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యను యూనియన్ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోయారు. దీనికి సుదర్శన్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలిస్తామని ఆయన హామీ ఇచ్చారు. వెంటనే ఆర్డీవోతో ఫోన్లో మాట్లాడి జర్నలిస్టుల ఇండ్ల స్థలాల కోసం భూ సేకరణ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజె (ఐజేయు) జిల్లా అధ్యక్షులు ఎడ్ల సంజీవ్, యూనియన్ నాయకులు బొబ్బిలి నర్సయ్య, గంగాదాసు, బైర శేఖర్, రామకృష్ణ, సిరిగాధ ప్రసాద్, రాజేష్, గోవిందరాజు, మల్లెపూల నర్సయ్య ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.


## బౌద్ధ సాంప్రదాయలతో అంతక్రియలు.

**వేగుచుక్క న్యూస్, ఆర్మూర్:**

బహుజన మేధావి, మూలనివాసి మాలజీ తల్లీ కూన ముత్తుబాయి (84) ఆదివారం రాత్రి మరణించారు. సోమవారం ఆర్మూర్ జిరాయత్ నగర్ లో ఆమె అంతక్రియలు బౌద్ధ సాంప్రదాయాలతో వినుత్నంగా నిర్వహించారు. దేహంపై నీలి బట్టలు కప్పి, మిత్ర బంధువులు పూల మాలలు వేసి నివాళి అర్పించారు. నిజామాబాద్ నుంచి విచ్చేసిన బంతే బుద్ధఘోష్ మాట చేతుల మీదుగా బౌద్ధ సాంప్రదాయాలతో అంతక్రియలు నెరవేర్చారు. ఆరంభంలో త్రిశరణం పంచశీల్ ఆలపించగా, దానిని ప్రజలు ఉచ్చారించారు. తదుపరి వైకుంతదామం వెళ్లే దారి పొడువునా బుద్ధం శరణం దమ్మం శరణం సంఘం శరణం గానం చేస్తూ, అంతిమ యాత్ర నిర్వహించారు. స్మశానంలో శవం కాడు వద్ద బంతే గారి "శర్ణగాథ" బోధనతో అంతక్రియలు ముగించారు. ఈ యాత్రలో ప్రముఖ అంబేద్కరిస్టులు కేశపెల్లి రవి, సుమన్ కుమార్, అంగరి ప్రదీప్, అడ్వకేట్ జీజీ రాం, ఆర్గుల సురేష్, అంబుజా మేడం, ఇత్వార్పేట్ లింగం, మల్లూరి బాబురావు, సురేష్ షాహు, ఎం.రాజరాం, జాంబవ చమార్, మూగ ప్రభాకర్, బుద్దిస్ట్ సొసైటీ అఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు అశోక్ భాగ్యవాన్, కే. కపిల్, రాజరతన్, వికాస్ పవార్, సీనియర్ టీచర్ తాళ్ల విద్యసాగర్, తుమ్మల వివేక్, ముతేన్న, జర్నలిస్టులు అంగులి మాల, మామిడి రాజు, జి.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వేగుచుక్క

# హిట్ కాంబో రిపీట్



దర్శకధీరుడు రాజమౌళి దర్శకత్వంలో సూపర్‌స్టార్ మహేష్‌బాబు హీరోగా ‘ వారణాసి ’ చిత్రంపై అంచనాలు రోజు రోజుకు పెరుగు తున్నాయి. రాజమౌళి సినిమా అంటేనే ప్రపంచ వ్యాప్తంగా ఆసక్తి నెలకొనడం సహజం. అందులోనూ తొలిసారి మహేష్‌బాబుతో ఆయన చేస్తున్న ప్రాజెక్ట్ కావడంతో ఈ సినిమాపై అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక దృష్టి పడింది.

అసలు విషయానికి వస్తే ‘వారణాసి’కి సంబంధించిన మరో కీలక అప్‌డేట్ సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. ఈ సినిమాలో మహేష్‌బాబు తండ్రి పాత్ర అత్యంత కీలకంగా ఉండబోతుందని సమాచారం. ఈ పాత్ర కోసం పలువురు సీనియర్ నటులతో లుక్ టెస్టులు నిర్వహించిన రాజమౌళి చివరకు ప్రకాష్‌రాజ్‌ని ఫిక్స్ చేశారని తెలుస్తోంది. అధికారిక ప్రకటన ఇంకా రాలేదుగానీ ప్రకాశ్ రాజ్ ఇప్పటికే షూటింగ్ లొకేషన్‌లో అడుగుపెట్టారని, ఆయనపై కొన్ని ముఖ్యమైన సన్నివేశాల చిత్రీకరణ కూడా మొదలైందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో “మహేష్ తండ్రిగా ప్రకాశ్ రాజ్” అన్న వార్త నెట్టింట వైరల్‌గా మారింది. ఈ కాంబినేషన్‌కు ఉన్న ట్రాక్ రికార్డ్ అభిమానులను మరింత ఉత్సాహపరుస్తోంది. గతంలో ఒక్కడు, పోకిరి, అతడు, అర్జున్, సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు, దూకుడు వంటి సినిమాల్లో మహేష్‌బాబు ప్రకాశ్ రాజ్ కలిసి నటించారు. ముఖ్యంగా దూకుడు, సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు చిత్రాల్లో ప్రకాశ్ రాజ్ మహేష్‌కు తండ్రిగా కనిపించి బలమైన ఎమోషన్‌ను పండించారు. ఇప్పుడు అదే రిలేషన్‌షిప్ మరోసారి రాజమౌళి స్కేల్‌లో రూపుదిద్దుకోబోతుందంటే అభిమానుల్లో సహజంగానే ఆనందం కనిపిస్తోంది. “హిట్ కాంబినేషన్ రీటర్న్స్” అంటూ సోషల్ మీడియాలో కామెంట్స్ వెల్లువెత్తుతున్నాయి.మొదట్లో మహేష్ తండ్రి పాత్రకు మాధవన్ పేరు వినిపించింది. కానీ ఆ వార్తల్లో నిజం లేదని, మాధవన్ ఈ సినిమాలో మరో కీలకమైన మైథాలజికల్ టచ్ ఉన్న పాత్రలో కనిపించనున్నారని సమాచారం.

ఇక కథ పరంగా చూస్తే, మహేష్‌బాబు ఈ చిత్రంలో ఐదు విభిన్న పాత్రల్లో కనిపించనున్నాడన్న ప్రచారం సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. మహేశ్‌ని రాముడిగా చూపించబోతున్నట్లు రాజమౌళి ఇప్పటికే ప్రకటించారు.

# ఇలా దొరికిపోయావ్ ఏంటి దేవిశ్రీ..





ఓజీ.. ఓజీ.. ఇప్పుడు ఎక్కడ విన్నా ఇదే పేరు వినిపిస్తోంది. ఈ సినిమాకి ఉన్న హైప్ చూస్తుంటే.. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కెరియర్‌లోనే హయ్యెస్ట్ వసూళ్లను రాబట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటివరకూ పవన్ కళ్యాణ్ స్టార్ హీరో రేంజ్ అనుభవించినా.. స్టార్ హీరోల లిస్ట్‌లో ఉన్నా.. లెక్కల పరంగా చూస్తే కలెక్షన్ల విషయంలో వెనుకపడే ఉన్నారు. ఆ విషయాన్ని మనం చెప్పడం కాదు.. స్వయంగా ఆయనే ఒప్పుకున్నమాట. నా సినిమాలు పెద్దగా ఆడవు.. మిగతా హీరోలతో నేను పోటీ పడలేను అని. కానీ ఈసారి ఓజీ చిత్రంతో బాక్సాఫీస్ బద్దలవ్వడం అయితే ఖాయంగా కనిపిస్తోంది.

సెప్టెంబర్ 25న ఈ సినిమా సింగిల్‌గా రిలీజ్ అవుతోంది. పోటీలో ఉంటుందనుకున్న బాలకృష్ణ అఖండ 2 వాయిదా పడటంతో ఓజీ రూ.200 కోట్ల క్లబ్‌లో చేరడం ఖాయంగా కనిపిస్తోంది. ఇదే జరిగితే.. పవన్ కళ్యాణ్ తొలిసారి రూ.200 కోట్లను కొల్లగొట్టినట్టే. ఓజీ ఫస్ట్ లుక్స్ మొదలు.. గ్లింప్స్, టీజర్, సాంగ్స్ ఇలా ప్రతిదీ హైప్‌ని పెంచేదిగానే ఉంది. ఇంతవరకూ అంతా బాగానే ఉంది కానీ.. ఎప్పుడైతే ఒక సినిమాపై విపరీతమైన అంచనాలతో థియేటర్స్‌కి వెళ్లామో.. అక్కడ అంతకుమించిన అద్భుతం జరిగితేనే మనం పైన అనుకున్న లెక్కల్ని దాటగలం. ఏమాత్రం తేడా వచ్చినా కూడా అంచనాలు తలకిందులౌతాయి అనడంలో సందేహం లేదు.

ఎందుకంటే ఒక సినిమాకి హైప్ రావడం అనేది ఎంత ముఖ్యమో.. ఓవర్ హైప్ వచ్చినా కూడా అంతే ప్రమాదం. గతంలో వచ్చిన ఓవర్ హైప్ చిత్రాలే వీటికి ఉదాహరణలు. ఆంధ్రావాలా, అజ్ఞాతవాసి, సాహో, స్పైడర్.. నిన్నగాక మొన్న వచ్చిన కూలీ ఈ సినిమాలన్నీ ఓవర్ హైప్‌తో రిలీజ్ అయ్యి.. బొక్కబోర్లా పడ్డ చిత్రాలే. అయితే అన్ని సినిమాలూ ఇలాగే అవుతాయని చెప్పలేం కానీ.. మిగతా సినిమాల సంగతి పక్కనపెట్టి.. పవన్ కళ్యాణ్ గత చిత్రాలను చూసినా కూడా ఓవర్ హైప్ వల్ల ఇమేజ్ పెరగడం కంటే డ్యామేజ్ అయిన సందర్భాలే ఎక్కువ.

పవన్ కళ్యాణ్ కెరియర్‌లో జల్సా, అత్తవారింటికి దారేది చిత్రాలు బ్లాక్ బస్టర్ హిట్లుగా నిలిచాయి. ఈ రెండు సినిమాలకు దర్శకత్వం వహించింది ఆయన మిత్రుడు త్రివిక్రమ్ శ్రీనివాస్. ఖుషీ హిట్ తరువాత.. జానీ, గుడుంబా శంకర్, బాలు, బంగారం, అన్నవరం.. వరుసగా వచ్చిన ఈ చిత్రాలన్నీ ఫ్లాప్‌లే. ఇలాంటి తరుణంలో పవన్ కళ్యాణ్ పని ఇక అయిపోయిందిలే అనుకున్న నేపథ్యంలో ట్రబుల్ షూటర్‌గా వచ్చిన త్రివిక్రమ్.. పవన్ కళ్యాణ్‌కి ‘జల్సా’ చిత్రంతో ఉపశమనం ఇచ్చారు. ఆ తరువాత మళ్లీ.. పులి, తీన్ మార్ వంటి ఫ్లాప్‌లు, గబ్బర్ సింగ్ హిట్.. కెమెరామెన్ గంగతో రాంబాబు ఫ్లాప్.. ఇలా పడుతూ లేస్తూ సాగుతున్న పవన్ కళ్యాణ్ కెరియర్‌లో ‘అత్తారింటికి దారేది’ అనే సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్‌ని ఇచ్చారు త్రివిక్రమ్.

# రిలీజ్ డేట్ ఫిక్స్..



మెగాస్టార్ చిరంజీవి, అనిల్ రావిపూడి కాంబోలో వస్తున్న ‘మన శంకర వరప్రసాద్ గారు’ సినిమా సంక్రాంతి బరిలోకి దిగుతోంది. ఇందులో విక్టరీ వెంకటేష్ స్పెషల్ క్యామియోలో కనిపించనున్నారు.ఇందులో నయనతార హీరోయిన్ గా నటిస్తుండగా.. విక్టరీ వెంకటేష్ స్పెషల్ క్యామియోలో కనిపించ బోతున్నారు. 2026 సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకి తీసుకురావాలనే టార్గెట్ పెట్టుకొని షూటింగ్ చేస్తున్నారు. అయితే ఏ తేదీకి థియేటర్లలో విడుదల చేస్తారనేది మేకర్స్ ప్రకటించలేదు. ఈ సస్పెన్స్ కి తెర దించుతూ తాజాగా రిలీజ్ డేట్ ను అఫీషియల్ గా అనౌన్స్ చేశారు.‘మన శంకర వరప్రసాద్ గారు’ సినిమాని సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. రిలీజ్ డేట్ అనౌన్స్ మెంట్ కోసం గ్రాండ్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా లాంచ్ చేసిన చిరంజీవి పోస్టర్ మెగా అభిమానులను ఆకట్టుకుంటోంది.

సంక్రాంతి పండక్కి బాక్సాఫీస్ దగ్గర తీవ్ర పోటీ నెలకొంది. జనవరి 9న ‘ది రాజాసాబ్’, ‘జన నాయకుడు’ సినిమాలు రానున్నాయి. జనవరి 14న ‘అనగనగా ఒక రాజు’, ‘నారీ నారీ నడుమ మురారి’, ‘పరాశక్తి’ చిత్రాలు విడుదల కానున్నాయి. ఇప్పుడు ‘మన శంకర వరప్రసాద్ గారు’ కోసం జనవరి 12వ తేదీని లాక్ చేశారు. వీటి మధ్యలో ‘భర్త మహాశయులకి విజ్ఞప్తి’ సినిమా రిలీజ్ కానుంది.

# అదరగొట్టిన ఆది పినిశెట్టి



నందమూరి బాలకృష్ణ నటించిన ‘అఖండ 2’ థియేటర్లలో బ్లాక్‌బస్టర్ టాక్‌తో దూసుకుపోతోంది. బాలయ్య రుద్ర తాండవం, హై వోల్టేజ్ యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ సినిమాలో తాంత్రికుడి పాత్రలో నటించిన ఆది పినిశెట్టి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. అతని లుక్, ఆహార్యం, స్క్రీన్ ప్రెజెన్స్ థియేటర్లలో గూస్‌బంప్స్ తెప్పిస్తున్నాయి. అయితే ఈ పాత్రకు మొదట దర్శకుడు బోయపాటి శ్రీను మంచు మనోజ్‌ను సంప్రదించారని సమాచారం. ఇతర కారణాలతో ఆయన ఈ సినిమాను చేయలేకపోవడంతో ఆ పాత్ర ఆది పినిశెట్టికి చేరింది.

ఎన్నో అడ్డంకులు, వాయిదాల మధ్య ఎట్టకేలకు నందమూరి బాలకృష్ణ నటించిన ‘ అఖండ 2 ’ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. డిసెంబర్ 12న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ సినిమా మొదటి షో నుంచేఈ చిత్రంలో బాలయ్యతో పాటు కీలక పాత్రలు పోషించిన నటీనటులు కూడా మంచి మార్కులు కొట్టేస్తున్నారు. సంయుక్త మేనన్‌తో పాటు కబీర్ దుహాన్ సింగ్, సాస్వత ఛటర్జీ, పూర్ణ వంటి వారు తమ తమ పాత్రలకు న్యాయం చేశారు. అయితే వీరిలో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సింది విలన్ పాత్రలే. సినిమాలో పలువురు ప్రతినాయకులు ఉన్నప్పటికీ, తాంత్రికుడి పాత్రలో నటించిన ఆది పినిశెట్టి ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాడు. అతని లుక్, ఆహార్యం, స్క్రీన్ ప్రెజెన్స్ థియేటర్లలో భయానక వాతావరణాన్ని సృష్టిస్తోంది అన్న మాట వినిపిస్తోంది. ఆది పినిశెట్టి పోషించిన తాంత్రికుడి పాత్ర సినిమాకు ప్రధాన బలంగా మారిందని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

అతని పాత్ర వచ్చే ప్రతిసారీ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, విజువల్స్ కలిసి గూస్‌బంప్స్ ఇచ్చేలా ఉన్నాయని ప్రేక్షకులు చెబుతున్నారు. నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రను ఆది ఎంతో సహజంగా, డేంజరస్‌గా మలిచాడని ప్రశంసలు అందుకుంటున్నాడు. బ్లాక్‌బస్టర్ టాక్‌ను సొంతం చేసుకుంది. ముఖ్యంగా బాలయ్య రుద్ర తాండవాన్ని తలపించే యాక్షన్ సీక్వెన్సులు థియేటర్లను దద్దరిల్లేలా చేస్తున్నాయి. పవర్‌ఫుల్ డైలాగ్స్, భారీ ఫైట్స్, మాస్ ఎలివేషన్లు అభిమానులను పండగ మూడ్‌లోకి నెట్టేశాయి. బోయపాటి శ్రీను తన స్టైల్‌కు తగ్గట్టుగా మాస్, ఆధ్యాత్మికత, యాక్షన్‌ను మేళవిస్తూ ఈ సినిమాను తెరకెక్కించాడన్న ప్రశంసలు వినిపిస్తున్నాయి. విడుదలైన వెంటనే థియేటర్ల వద్ద హౌస్‌ఫుల్ బోర్డులు, అభిమానుల సంబరాలు కనిపించడం సినిమాకు వస్తున్న రెస్పాన్స్‌ను స్పష్టంగా చూపిస్తోంది.

# జేమ్స్ కామెరూన్ మాస్ వార్నింగ్

హాలీవుడ్‌లో విజువల్ వండర్స్‌కు మరో పేరు జేమ్స్ కామెరూన్ . ఆయన దర్శకత్వంలో రూపొందిన సినిమాలు అంటే ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల్లో ప్రత్యేకమైన అంచనాలు ఏర్పడటం సహజం. ముఖ్యంగా ‘అవతార్’ ఫ్రాంచైజీకి ఉన్న క్రేజ్ గురించి






ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. 2009లో విడుదలైన ‘అవతార్’ సినిమా ప్రపంచవ్యాప్తంగా సంచలన విజయాన్ని నమోదు చేసి బాక్సాఫీస్ చరిత్రనే మార్చేసింది.

ఆ తర్వాత 2022లో వచ్చిన రెండో భాగం ‘అవతార్: ది వే ఆఫ్ వాటర్’ కూడా అదే స్థాయిలో ప్రేక్షకులను మెస్మరైజ్ చేసింది. భాష, దేశం, ప్రాంతం అనే తేడా లేకుండా ఈ రెండు సినిమాలు రికార్డు స్థాయి వసూళ్లను సాధించాయి. ఇప్పుడు ఈ సిరీస్‌లో మూడో భాగంగా తెరకెక్కిన ‘ అవతార్: ఫైర్ అండ్ యాష్ ’ డిసెంబర్ 19న ప్రేక్షకుల ముందుకు రానుండటంతో ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి.

జేమ్స్ కామెరూన్ పండోరా ప్రపంచంలో మరో కొత్త కోణం, సరికొత్త విలన్, మరింత భారీ విజువల్స్ ను చూపించబోతున్నాడనే వార్తలతో ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# పాతికేళ్లుగా ఆనందంగా లేను



బాలీవుడ్‌లో దశాబ్దాలుగా స్టార్ హీరోగా కొనసాగుతోన్న సల్మాన్ ఖాన్‌కు ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. మాస్ ఎంటర్‌టైనర్‌లతో పాటు ఫ్యామిలీ ఆడియన్స్‌ను ఆకట్టుకునే సినిమాలతో ఆయన ఒక ప్రత్యేకమైన అభిమాన వర్గాన్ని సంపాదించుకున్నారు. కెరీర్ ఆరంభం నుంచి ఇప్పటివరకు ఎన్నో బ్లాక్‌బస్టర్లు, సూపర్‌హిట్లు ఇచ్చిన సల్మాన్, నటుడిగా మాత్రమే కాకుండా స్టార్‌డమ్‌కు నిర్వచనంగా మారిపోయారు. ప్రస్తుతం ఆయన నటిస్తున్న తాజా చిత్రం ‘బ్యాటిల్ ఆఫ్ గల్వాన్’పై భారీ అంచనాలు నెలకొన్నాయి. 2020లో తూర్పు లద్దాక్ సరిహద్దుల్లోని గల్వాన్ లోయలో భారత్, చైనా సైనికుల మధ్య జరిగిన ఉద్రిక్త పరిస్థితుల ఆధారంగా ఈ సినిమా తెరకెక్కుతోంది. దేశభక్తి, సైనికుల త్యాగం, సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రం సల్మాన్ కెరీర్‌లో మరో ప్రత్యేకమైన ప్రాజెక్ట్‌గా భావిస్తున్నారు.

సౌదీ అరేబియాలో నిర్వహించిన ‘రెడ్ సీ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్’కు హాజరైన సల్మాన్‌ఖాన్ అక్కడ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్‌మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. వేదికపై మాట్లాడిన ఆయన తన వ్యక్తిగత జీవితం గురించి సంచలన వ్యాఖ్యలు చేశారు. “గత పాతికేళ్లుగా నేను బయట ప్రశాంతంగా డిన్నర్ చేయలేదు. ఇల్లు, షూటింగ్ లొకేషన్, ఎయిర్‌పోర్టుల మధ్యే నా జీవితం సాగిపోయింది. మీకు తెలియని విషయం ఏంటంటే, నేను మీరు అనుకున్నంత ఆనందంగా ఉండను” అంటూ సల్మాన్ భావోద్వేగానికి లోనయ్యారు. స్టార్‌డమ్ వెనుక దాగి ఉన్న ఒంటరితనం, ఒత్తిడిని ఆయన మాటల్లో స్పష్టంగా వ్యక్తం చేశారు.

ఇంకా మాట్లాడుతూ తన జీవితంలో ఎదురైన నష్టాలను కూడా గుర్తుచేశారు. “నా ప్రాణ స్నేహితుల్ని చాలామందిని కోల్పోయాను. ఇప్పుడు నిజంగా ‘నా వాళ్లు’ అని చెప్పుకునే నలుగురు మాత్రమే మిగిలారు” అని చెప్పినప్పుడు వేదికపై ఉన్నవారంతా మౌనంగా ఉండిపోయారు. ఈ వ్యాఖ్యలు అభిమానులను కూడా భావోద్వేగానికి గురి చేశాయి. అంతేకాదు, తన నటనపై కూడా సల్మాన్ స్వయంగా సరదాగా, కొంత బాధతో కూడిన వ్యాఖ్యలు చేశారు. “నేను పెద్ద స్టార్ కావచ్చు కానీ గొప్ప నటుడ్ని కాదు. తోచినట్టు నటిస్తాను. ఎమోషనల్ సీన్స్‌లో నేను ఏడిస్తే ప్రేక్షకులు నవ్వుతారు” అంటూ తనపై తానే సెటైర్ వేసుకున్నారు.

అయితే సల్మాన్ చేసిన ఈ వ్యాఖ్యలకు అభిమానుల నుంచి భిన్నమైన స్పందన వస్తోంది. సోషల్‌మీడియాలో ఆయనను సమర్థిస్తూ అనేక పోస్టులు వైరల్‌గా మారాయి. “మీరు అలా మాట్లాడటం సరైంది కాదు. తెరపై మీరు బాధపడితే మేమూ భావోద్వేగానికి లోనవుతాం” అంటూ అభిమానులు రాస్తున్నారు. మరికొందరు “మీరు గొప్ప నటుడే అన్నది ‘భజరంగీ భాయిజాన్’ సినిమా చూస్తే ఎవరికైనా అర్థమవుతుంది” అంటూ గుర్తు చేస్తున్నారు. సల్మాన్ సినిమాల్లోని భావోద్వేగ సన్నివేశాలు కోట్లాది మంది ప్రేక్షకుల హృదయాలను తాకాయని అభిమానులు చెబు తున్నారు. మొత్తానికి రెడ్ సీ ఫిల్మ్ ఫెస్టివల్ వేదికపై సల్మాన్‌ఖాన్ చేసిన ఈ ఎమోషనల్ కామెంట్స్ ఆయన స్టార్ ఇమేజ్‌కు మరో కోణాన్ని చూపించాయి. ఎంతటి స్టార్‌డమ్ ఉన్నా, లోపల మాత్రం ఒక సాధారణ మనిషిగా ఉన్న సల్మాన్ మనస్తత్వం ఈ మాటల్లో ప్రతిబింబించిందని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ‘బ్యాటిల్ ఆఫ్ గల్వాన్’తో ఆయన మరోసారి ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తారా అన్న ఆసక్తి ఇప్పుడు మరింత పెరిగింది.

# పుష్ప-2 రికార్డును బ్రేక్ చేసిన ‘ధురంధర్’



రణవీర్ సింగ్ నటించిన లేటెస్ట్ మూవీ ‘ధురంధర్’. ఆదిత్యధర్ దర్శకత్వం వహించిన ఈ యాక్షన్ థ్రిల్లర్ లో సారా అర్జున్ హీరోయిన్ గా నటించింది. ఆర్.మాధవన్, అక్షయ్ ఖన్నా, సంజయ్ దత్, అర్జున్ రాంపాల్ కీలక పాత్రల్లో నటించారు. ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర బ్లాక్ బస్టర్ దిశగా దూసుకుపోతోంది. రోజు రోజుకూ కలెక్షన్స్ పెంచుకుంటూ పోతోంది. ఈ క్రమంలో తాజాగా ఈ చిత్రం ఓ అరుదైన రికార్డ్ క్రియేట్ చేసింది.

‘ధురంధర్’ సినిమా డిసెంబర్ 5న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో రిలీజయింది. మూడు రోజుల్లో రూ. 100 కోట్ల క్లబ్ లో చేరింది. డిసెంబర్ 11 నాటికి రూ.252 కోట్లకు పైగా నెట్ కలెక్షన్స్ రాబట్టినట్లు ట్రేడ్ వర్గాలు వెల్ల డించాయి. నిన్న శుక్రవారం ఒక్క రోజే రూ.34.70 కోట్ల వసూళ్లు రాబట్టినట్లు పేర్కొ న్నారు. అంతేకాదు రెండో శుక్రవారం నాడు ‘పుష్ప 2: ది రూల్’, ‘ఛావా’, ‘యానిమల్’, ‘గదర్ 2’, ‘బాహుబలి 2’ చిత్రాలను క్రాస్ చేసి, సరికొత్త రికార్డు సృష్టించిందని అంటున్నారు

‘పుష్ప 2’ సినిమా బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి సంచనాలు సృష్టించిందో మనం చూశాం. అత్యధిక గ్రాస్ వసూలు చేసిన చిత్రంగా ఇండియన్ ఇండస్ట్రీ రికార్డ్ క్రియేట్ చేసింది. రూ.800 కోట్లకు పైగా నెట్ తో హిందీలో హయ్యెస్ట్ కలెక్షన్స్ సాధించిన మూవీగా చరిత్ర తిరగరాసింది. ఇక రెండో శుక్రవారం హిందీలో రూ. 27.50 కోట్లు కలెక్ట్ చేయగా.. ఇప్పుడు ‘ధురంధర్’ సినిమా దాన్ని అధిగమించినట్లు తెలుస్తోంది.